క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో వైఎస్సార్ సీపీ పాలకవర్గం ఏర్పడిన తరువాత అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని 95వ సచివాలయం పరిధిలో రూ.30 లక్షలతో నూతనంగా డ్రెయిన్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ తన డివిజన్‌లోనూ పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు.

అన్నదానం పుణ్య కార్యం: మేయర్

నెహ్రూనగర్: భక్తులకు అన్నదానం పుణ్య కార్యమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు.నగరంలోని సంపత్ నగర్, నల్లచెరువు, ఆర్. అగ్రహారం, అమరావతి రోడ్డు తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి మేయర్ భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అందుగుల సంతోష్, వైఎస్సార్ సీపీ నాయకులు సాదు రాజేష్, కంతేటి శ్యాం, శేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఏడో డివిజన్‌లో...

పట్నంబజారు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏడో డివిజన్ శీలంవారి వీధిలో శ్రీను, శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని నగర డెప్యూటీ మేయర్ షేక్ సజిల ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్, కిశోర్, సుధాకర్, చంద్రమోహన్, బసవయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి

నెహ్రూనగర్: ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ కోరారు. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డాను ఢిల్లీలో కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్య, వైద్య విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టుల్ని తక్షణం భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం వల్ల వైద్య విద్యలో ఎంతో మంది దళిత, గిరిజన విద్యార్థులు నష్టపోతున్నారని, దీని వల్ల భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దళితులపై జరుగుతున్న దాడులు, అరాచకాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, వాటిపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రామ్మూర్తి, ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోదా జాన్ పాల్, మహిళా విభాగ అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి, పిల్లి మేరీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు ధార హేమ ప్రసాద్, శీలం రోజన్ బాబు, సురేష్ పాల్గొన్నారు.

నేడు పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు శనివారం బీఆర్ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని, సీనియర్ వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు.

వీవీఐటీలో ఐక్యా-2023కి స్పందన

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో (వీవీఐటీ) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబరు 21, 22 తేదీల్లో ఐక్యా-2023 నిర్వహించినట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని వీవీఐటీలో శుక్రవారం చైర్మన్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 కళాశాలల నుంచి 1,550 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. టగ్ ఆఫ్ వార్స్, ప్రాజెక్ట్ ప్రజెంటేషన్, ఎస్కేప్‌రూమ్, పిక్షనరీ వంటి సాంకేతిక విభాగాలలో ఈ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇండియన్ నేవీ రిటైర్డ్ కమాండర్, అర్‌టెల్లి సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు ప్రపంచానికి పరిచయం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సాంకేతిక అధ్యయనంపై కూడా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం సాంకేతికోత్సవాలలో ఉత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వై.భానుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి



రోడ్డుపై చెత్తను చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరాన్ని క్లీన్ గుంటూరుగా తీర్చిదిద్దడంలో భాగంగా పారిశుద్ధ్య మెరుగుకు ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం ఉండాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఆమె శుక్రవారం నవభారత్ నగర్, విద్యా నగర్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య పనుల్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని డంపింగ్ పాయింట్స్‌లో వ్యర్థాలు చెల్లాచెదురుగా ఉండటం, ఉదయం 11 గంటలకు కూడా డంపర్ బిన్ వద్ద వ్యర్థాలు తొలగించక పోవడంపై పారిశుద్ధ్య పర్యవేక్షణ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్, సూపర్వైజర్, ఎంహెచ్‌వోలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిన్ పాయింట్ మేరకు పారిశుద్ధ్య పనులు జరగక పోవడంపై శనివారం నాటికీ నివేదిక ఇవ్వాలని ఎంహెచ్‌వోని ఆదేశించారు. నివేదిక మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రణాళికాబద్ధ చర్యలు

అనంతరం చాంబర్‌లో తూర్పు నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా పారిశుద్ధ్య సమస్యల్ని కమిషనర్ దృష్టికి తెచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణకు నగరపాలక సంస్థ నుంచి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కూడా మెరుగైన పారిశుద్ధ్యం కోసం తగిన సహకారం, సలహాలు అందిచాలని కోరారు. క్లీన్ గుంటూరు అంటే నగర ప్రజలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన పరిసరాల్ని అందించడమేనని తెలిపారు. ఇందులో నిర్లక్ష్యంగా ఉండే కార్మికులు, కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తీసుకోక తప్పదని స్పష్టం చేశారు. డివిజన్ల వారిగా పారిశుద్ధ్య కార్మికుల్ని రేషనలైజేషన్ చేసి, ఈ-ఆటోలు ఉన్న డివిజన్లలో ఉదయం 6 గంటల నుంచే ఇంటింటి చెత్త సేకరణ జరగాలని ఎంహెచ్‌వోని ఆదేశించారు.సెక్రటరీలు ఉన్న డివిజన్లలోని సూపర్వైజర్లను పారిశుద్ధ్య పనులకు కేటాయించాలని, కార్మికులు అవసరమైన డివిజన్లకు ఇతర డివిజన్ల నుంచి కేటాయించాలని చెప్పారు. ఈ-ఆటోలకు, మెయిన్ రోడ్ల శుభ్రానికి ప్రత్యేకంగా కార్మికుల్ని కేటాయించాలని ఎస్ఎస్‌లను ఆదేశించారు. సిల్ట్ వర్క్ చేయడానికి అవసరమైన కార్మికుల్ని టెండర్ ద్వారా పిలవాలని ఈఈని ఆదేశించారు. ఇక నుంచి పారిశుద్ధ్య పనుల్ని ఉదయం, మధ్యాహ్నం గ్యాంగ్‌వర్క్‌లను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కోటేశ్వరరావు, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆనంద్‌కుమార్, ఆయూబ్ ఖాన్, సోమశేఖర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే బహుళ అంతస్తుల నిర్మాణాలు

నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాల ర్యాంప్‌లు రోడ్డు మీదకు రాకూడదని, సెట్ బ్యాక్‌లో నిర్మాణాలు చేయరాదని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయబోమని ఆమె స్పష్టం చేశారు. ఆమె శుక్రవారం ఎస్.వి.ఎన్.కాలని, వికాస్ నగర్, ఇన్నర్ రింగ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని పరిశీలించి, తదుపరి అనుమతులపై పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆమె సూచించారు. ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిబంధనలతో పాటు చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని ఆమె చెప్పారు. పర్యటనలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ సిటీప్లానర్ అజయ్ కుమార్, టీపీఎస్ హృదయరాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ న్యాయవాదుల సదస్సుకు ఆహ్వానం

గుంటూరు లీగల్: న్యూఢిల్లీ విద్యాభవన్‌లో ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ న్యాయవాదుల సదస్సులో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆహ్వానం మేరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి పాల్గొననున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో న్యాయవాదుల భవిష్యత్ ప్రయోజనాలు తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. భారత్ ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, భారత ప్రధాన న్యాయమూర్తి వై.వి.చంద్రచూడ్, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతోపాటు కేంద్ర మంత్రులు, న్యాయనిపుణులు పాల్గొంటారని వివరించారు.

పెన్షనర్ల సమస్యల్ని పరిష్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: పెన్షనర్ల సమస్యల్ని పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి. వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. బ్రాడీపేట తాలూకా ప్రాంగణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల్ని చెల్లించాలని కోరారు. అసోసియేషన్ సలహాదారు దాలినాయుడు మాట్లాడుతూ సీపీఎఫ్ఎంఎస్ విధానంలో పెన్షనర్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వారి సమస్యల్ని పాత విధానంలో ఎస్టీయూల పరిధిలోనే పరిష్కరించేలా అసోసియేషన్ పరంగా కృషి చేయాలని పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. ప్రభుదాస్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌కేర్ ట్రస్ట్‌లో పెన్షనర్స్ అసోసియేషన్‌ను సభ్య సంఘంగా నమోదు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి టీవీఎస్ఎస్ఆర్‌పి శర్మ, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ



గుంటూరు మెడికల్: సుష్మ గౌడ్ 21వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక పట్నంబజారులోని సుష్మ గౌడ్ ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రూ. 1.20లక్షల స్కాలర్ షిప్స్‌లు, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ట్రస్టు ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా స్కాలర్‌షిప్పులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు వీరంకి రంగారావు, జిల్లా గౌడ ఉద్యోగస్తుల సంఘ అధ్యక్షుడు చెన్ను శ్రీనివాస్ కుమార్, గౌడ సేవా ట్రస్టు అధ్యక్షుడు దాసరి వెంకట్రావు, సంస్థ ఉపాధ్యక్షుడు నాగ వెంకట శివ ప్రసాద్, సంస్థ కార్యదర్శి జల్లెడ ఓంకారం, కోశాధికారి జయ సుస్మితరావు గౌడ్, ప్రధాన కార్యదర్శి సుష్మారావు గౌడ్, సహ కార్యదర్శి హారిత గౌడ్, సంస్థ సభ్యులు అరేపల్లి విగ్నేశ్వరమ్మ, వాకా మాధవరావు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మందులు వాడటం ప్రమాదకరం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, తదితరులు

గుంటూరు మెడికల్: వైద్యుల అనుమతి లేకుండా ఇష్టానుసారంగా వాడటం వల్ల కలిగే దుష్ఫలితాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుల దుష్ఫలితాలపై ప్రజలకు వివిధ రూపాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజలు మందులు వేసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. రోగులు సొంత వైద్యం చేసుకోవడం వల్ల నష్టం జరుగుతుందని తెలిపారు. ఒక్కొక్కసారి మందులు తీసుకోవడం వల్ల కళ్లు తిరగడం, చెమటలు పట్టడం జరిగితే వెంటనే ఆపి వేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి. ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

టాటా నెక్సాన్ పెట్రోల్, ఎలక్ట్రిక్ కార్లు మార్కెట్లోకి విడుదల



లియాఖత్‌కు కారు కీని అందిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ప్రభాకరరావు

పాత గుంటూరు: గుంటూరు జాస్పర్ కార్ షోరూంలో టాటా మోటార్స్ నూతనంగా విడుదల చేసిన నెక్సాన్ పెట్రోల్, ఎలక్ట్రికల్ వాహనాలను శుక్రవారం అరండల్‌పేట ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ప్రభాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. మొదటి కారు డెలివరీని షేక్ లియాఖత్‌కు ఆయన అందించారు. జాస్పర్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రీమియం డిజైన్, బెస్ట్ ఇన్ క్లాస్ నెక్స్ట్ లెవెల్ ప్రీమియం ఫీచర్స్‌తో వస్తున్న నెక్సాన్ ప్రారంభ ధర రూ.8.09 లక్షలుగా, ఎలక్ట్రికల్ ధర రూ. 14.74 లక్షలుగా ఉన్నట్లు చెప్పారు. ప్రారంభ మోడల్ నుంచే ఆరు ఎయిర్ బ్యాగ్స్ ఉంటాయని, ఫైవ్ స్టార్ రేటింగ్ ను కలిగి ఉందని తెలిపారు. కార్లలో బూట్ స్పేస్ కంప్లీట్ ఫ్రీగా ఉంటుందని చెప్పారు. 360 డిగ్రీల కెమెరా దీని ప్రత్యేకతని, అత్యధిక మైలేజ్, అతి తక్కువ ధరల్లో కార్లు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

- ఇంటింటికి వైద్య బృందం సర్వే
- ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు



దుగ్గిరాలలో ఇంటింటి సర్వే పరిశీలిస్తున్న గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు

తాడేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యల్ని పరిష్కరించుకోవాలని గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు కోరారు. దుగ్గిరాల మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నామని వివరించారు. ముందుగా ఆయా ప్రభుత్వ వైద్యశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశ వర్కర్లతో కలసి వైద్యులు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అనే విషయాన్ని తెలుసుకుంటారని, వారికి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని తెలియజేస్తే వారికి సర్వేలో పాల్గొన్న సిబ్బంది ఒక టోకెన్ అందజేస్తారని చెప్పారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. అందులో జనరల్ చెకప్ చేసే డాక్టర్లతో పాటు స్పెషలిస్టులు కూడా ఉంటారని, వారికి అక్కడే 14 రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని డీఎంహెచ్‌వో వివరించారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

గుంటూరు రూరల్: సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించి మంచి లాభాల్ని పొందవచ్చని కృషివిజ్ఞాన కేంద్రం (కేవీకే) విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.వెంకటనాయుడు తెలిపారు. నగర శివారులోని లాం ఫాం కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ఎరువుల పంపిణీ, ఎస్సీ రైతులకు గతంలో అందించిన పెరటి కోళ్ల పెంపకం, రైతు అవగాహన సదస్సుల గురించి అడిగి తెలుసుకున్నారు. పాడి రైతులు పాల ఉత్పాదన, వెన్నశాతం పెరగడానికి ప్రోబయోటిక్స్‌ను రైతులకు అందజేశారు. అనంతరం కేవీకే దత్తత గ్రామాలైన కొత్తపాలెం, వల్లభాపురంలో రైతులతో క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన జరిపారు. మినుములో సామూహిక క్షేత్రస్థాయి ప్రదర్శనలో భాగంగా ఎల్‌బీజీ 884 రకాలను పరిశీలించారు. జీవన ఎరువుల్ని రైతులకు ఉచితంగా అందజేశారు. పెరటి తోటల పెంపకం గురించి మహిళా రైతులకు వివరించి, కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.వి.సుబ్రమణ్యం, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులో బహుజన మహిళలకు ప్రత్యేక వాటా కల్పించాలి

నెహ్రూనగర్: మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ప్రత్యేక వాటా కల్పించాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ కోరారు. అరండల్‌పేట భీమ్ భారత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్ని మభ్య పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును తెరపైకి తెచ్చిందని తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల్ని విస్మరించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 1996లో ప్రవేశపెట్టిన బిల్లులో లోపాన్ని సవరించకుండానే పాత దాన్ని యథాతథంగా ప్రస్తుత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లోక్ సభలో ప్రవేశపెట్టిందని విమర్శించారు. నూటికి 80 మంది ఉన్న బహుజన మహిళలకు ప్రాతినిధ్యం లేని బిల్లు 20 శాతంగా ఉన్న ఆధిపత్య కులాల మహిళలకే పరిమితం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లు ద్వారా ధనికవర్గ, పెత్తందారుల ఆధిపత్య ధోరణితో ఉన్న మహిళలకు మాత్రమే స్థానం దక్కే ప్రమాదం పొంచి ఉందని, తద్వారా సామాజిక న్యాయానికీ ప్రమాదం పొంచి ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా



శంకుస్థాపన చేస్తున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నాలుగో డివిజన్ జాకీర్‌హుస్సేనగర్ -2, 3, 4లైనులకు సంబంధించి రూ. 22 లక్షలతో శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 17వ డివిజన్‌లోని మేనకా గాంధీనగర్ 7వ లైనులో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు రూ. 49 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అభివృద్ధి పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. సీఎం వై.ఎస్.జగన్ అందుకు భిన్నంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేయకుండా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ, సంక్షేమ సారథిగా పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో నాలుగో డివిజన్ కార్పొరేటర్ మెహమూద్, వైఎస్సార్ సీపీ నేతలు నాగేశ్వరి, సుబ్బులు, బాషా, ఇబ్రహీం, సైదా పాల్గొన్నారు. 17వ డివిజన్ కార్యక్రమంలో కార్పొరేటర్ ఫర్జానా, పార్టీ డివిజన్ అధ్యక్షుడు యాదాల చిన్న, బిఖారీ మేస్త్రీ, వెంకటరెడ్డి, రాము, అంకమ్మరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై క్షేత్రస్థాయి పరిశీలన

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించాలని రూరల్ మండలం ఎంపీడీవో ఎస్.ఆదినారాయణ తెలిపారు. మండలంలోని ఓబులునాయుడుపాలెంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సిబ్బందితో కలసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు చేస్తున్న ఇంటింటి సర్వేలో ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారం, ప్రజలకు అందిస్తున్న సమాచారం పరిశీలించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ సచివాలయ సిబ్బందికి విధులు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేశం శ్రీలక్ష్మి, కేశం హరనాద్(బాజీ), ఈఓపీఆర్‌డీ కె.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: ఇంట్లో పని చేస్తున్న ఓ యువతి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ మూడో లైనులో భరత్‌కుమార్‌రెడ్డి నివాసం ఉంటున్నాడు. రెండు సంవత్సరాలుగా నెల్లూరుకు చెందిన పరిమళ (20) ఆయన ఇంట్లో పని చేస్తోంది. ఆమెకు తల్లిదండ్రులు ఇటీవల వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇది ఇష్టంలేని పరిమళ మానసికంగా కృంగిపోయి గురువారం రాత్రి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

గణేష్ నిమజ్జనంలో జరిగిన వివాదం నేపథ్యంలో ముగ్గురు వ్యక్తులు కలసి మరో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గణేష్ వారి వీధికి చెందిన దాసరి విష్ణు వినాయక విగ్రహ నిమజ్జనం సమయంలో కొందరు మద్యం తాగి గొడవ చేస్తుంటే వారించాడు. నిమజ్జనం అనంతరం రజాక్, ప్రశాంత్, సాయి కలసి విష్ణుపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



ఏపీఐటీఏ సీఈవో ప్రొఫెసర్ రామకోటిరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ కళ్ళం మోహనరెడ్డి

గుంటూరు రూరల్: విద్యార్థులు ఉద్యోగాల కోసం ఆలోచించకుండా పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి పది మందికి ఉపాధిని చూపించాలని ఏపీఐటీఏ సీఈవో ప్రొఫెసర్ డి.వి.రామకోటిరెడ్డి తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళ్లం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సంకల్ప్- 2023 వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక పురోగతి ఒక్క ఐటీ రంగంలోనే కాకుండా వివిధ పారిశ్రామిక వస్తు ఉత్పత్తి, గిడ్డంగి, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో రాణిస్తోందన్నారు. ఉద్యోగాలను సాధించేందుకు విద్యార్థులు నైపుణ్యతలు కలిగిన విద్యతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు వివిధ రకాల పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఈ ఏడాదిలో కళాశాల సాధించిన ప్రగతి, విద్యార్థులకు అందజేస్తున్న సౌకర్యాలు, వసతులు వివరించారు. కళాశాల చైర్మన్ కళ్లం మోహనరెడ్డి మాట్లాడుతూ రెండురోజులపాటు జరిగే ఈ జాతీయ స్థాయి సదస్సులో సాంకేతిక, టెక్నికల్ పోటీలు, చెస్, క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, త్రోబాల్, ఇండోర్ గేమ్స్, అవుట్‌డోర్ గేమ్స్ నిర్వహిస్తున్నామన్నారు. వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, సదస్సు కన్వీనర్ డాక్టర్ జె.వి.కె. రత్నం పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనల గాయకులకు ఆహ్వానం

తెనాలి: పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అన్నమయ్య కీర్తనల ఆలాపన'కు శాస్త్రీయ సంగీతంలో ప్రవేశమున్న 30 ఏళ్లలోపు యువతీయువకులను ఆహ్వానిస్తున్నట్టు అధ్యక్షుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గలవారు అన్నమయ్య కీర్తనలు రెండు (పల్లవి, ఒక చరణం) పాడి 9849131035కు వాట్సాప్‌లో పంపించాలని కోరారు. వీరితో ఆడిషను నిర్వహించి, వారి గాత్ర ధర్మం ప్రకారం కీర్తనలు కేటాయించి తగిన శిక్షణనిస్తామని తెలిపారు. అనంతరం వాద్య సహకారంతో రిహార్సల్స్ చేయించి, డిసెంబరు 17వ తేదీన తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించే గానాలాపనలో గాయనీగాయకులుగా పరిచయం చేస్తామని వివరించారు.

తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య

మంగళగిరి: తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కార్పొరేషన్ పరిధి నవులూరులో చోటుచేసుకుంది. నవులూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన గైరుబోయిన గురవయ్య- రమణమ్మ దంపతుల కుమార్తె గురులక్ష్మి(20) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంట్లో పని చేయాలని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన గురులక్ష్మి తల్లి బయటకు వెళ్లగానే ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

రేపు పెదరావూరులో ఉచిత వైద్య శిబిరం

తెనాలి రూరల్: పట్టణానికి చెందిన వి కార్డియాక్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని పెదరావూరులో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూలు ఆవరణలో ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుంది. ఈసీజీ, థైరాయిడ్, షుగరు, రక్త పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. చిన్న పిల్లలతో పాటు మహిళలు, గర్భిణులకూ వైద్య పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు.

పాడి పెరుగుదలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొల్లిపర(తెనాలి): పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగులకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు చేశారు. కొల్లిపర మండల గ్రామం వల్లభాపురంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.వెంకటనాయుడు, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ఎం.గంగాదేవి, వెటర్నరీ సైంటిస్ట్ డాక్టర్ అర్చన, గృహ విజ్ఞాన శాస్త్రం నిపుణులు ఎం.దీపక్ పాల్గొన్నారు. పాడి పెరుగుదలతో పాటు అనుబంధంగా ఇంటి దగ్గర కోళ్లను పెంచాలని సూచించారు. మంచి పశువులకు 95 శాతం పెయ్య దూడలు మాత్రమే పుట్టేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు అజిటో బ్యాక్టీరియా, పాస్ఫో బాక్టీరియా, సుడోమోనాస్‌ను 100 కిలోల బాగా మాగిన పశువుల ఎరువులో కలిపి తయారు చేసుకుని, వరి, ఉద్యాన పంటల్లో వేయడం వల్ల ఎంతో ఉపయోగకరమని చెప్పారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాల్ని పొందవచ్చని తెలిపారు. ఈ బాక్టీరియా నేలకు కూడా చాలా ఉపయోగకరమైన సూక్ష్మజీవులుగా వివరించారు. కార్యక్రమంలో వల్లభాపురం గ్రామ సర్పంచ్ నిర్మల, ఉప సర్పంచ్ పోతిరెడ్డి, ప్రకృతి వ్యవసాయం వల్లభాపురం యూనిట్ మాస్టర్ ట్రైనర్ నాగకృష్ణ, మున్నంగి ఇన్‌చార్జి సుధారాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.